క్లుప్తంగా

బగళాముఖిని దర్శించుకున్న పనబాక



చందోలు(కర్లపాలెం): కేంద్ర మాజీ మంత్రి టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ శనివారం బగళాముఖి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం పనబాక లక్ష్మికి స్వాగతం పలికారు. పనబాక లక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. అనంతరం పనబాక లక్ష్మికి అమ్మవారి చిత్ర పటం, ప్రసాదాలను ఈవో అందజేశారు. ఆమె వెంట టీడీపీ నాయకులు బసివిరెడ్డి, చక్రధర్‌రెడ్డి, మద్దాల డేవిడ్, వెంకటప్పయ్య, రామచంద్రరాజు తదితరులు ఉన్నారు.

రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి

తహసీల్దార్ శ్రీనివాసరావు



రేపల్లె: ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ ఒకటవ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రేషన్ పంపిణీ వాహనాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేసే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. ఇకపై రేషన్ దుకాణాల ద్వారానే లబ్ధిదారులకు సరుకులు అందించాల్సి ఉంటుందని చెప్పారు. నిర్దేశించిన తేదీలు సమయాలలో డీలర్లు రేషన్ షాపుల్లో అందుబాటులో ఉండి సక్రమంగా లబ్ధిదారులకు సరుకులు అందించాలన్నారు. రేషన్ డీలర్ల పనితీరుపై అధికారుల నిఘా ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పార్టీ బలోపేతానికి పని చేయాలి

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



రేపల్లె: గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం అయ్యేలా పని చేయాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్ కోరారు. వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన మారేటి సురేందర్ రెడ్డి శనివారం గుళ్ళపల్లిలోని పార్టీ కార్యాలయంలో గణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గణేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలను శిరసావహిస్తూ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

తెనాలి అర్బన్: యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శనివారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నార్త్ ఇండియాకు చెందిన శిక్షకులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ శిబిరాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వం నిర్వహించనున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో జరిగే వేడుకల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొంటారని వివరించారు. దీనిలో భాగంగా ప్రతిరోజు తెనాలి పట్టణంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు, ఆర్వో రాం ప్రసాద్, పలువురు మున్సిపల్ అధికారులు, యోగ సాధకులు పాల్గొన్నారు.

వీరే కీలకం

నీటి పారుదల శాఖలో ముఖ్యమైన లస్కర్ల కొరత

- ఏడాది పొడవునా అదనపు భారం మోస్తోన్న లస్కర్లు
- నీటి సరఫరా నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం



నాగరాజు కాలువ

బాపట్ల: వ్యవసాయ పనులు మొదలవుతున్నాయి.. ఈ ఏడాది ముమ్మరంగా వర్షాలు కురుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అవగాహన లోపంతో వేసవి కాలంలో కాలువ మరమ్మతులు చేయించలేకపోయింది. దీంతో కాలువ ద్వారా వచ్చే నీరు కూడా ఆయకట్టు రైతులకు సరిపోయే అవకాశం కనిపించటం లేదు. సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉండటంతో కాల్వల ద్వారా విడుదలయ్యే నీటిని అత్యంత జాగ్రత్తగా ఉపయోగించాల్సి ఉంటుంది. లేకుంటే సాగు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా మరోపక్క నీటి సరఫరాలో కీలకంగా వ్యవహరించే నీటి పారుదల శాఖను లస్కర్ల కొరత వెంటాడుతుంది. సాగునీటి కాలువల నిర్వహణ, నీటి విడుదల, సరఫరా విభాగాల్లో లస్కర్లు రేయింబవళ్లు కాలువలను పర్యవేక్షించే పనిలో ఎంతో కీలకపాత్ర పోషిస్తుంటారు.

భర్తీపై దృష్టి పెట్టడం లేదు

పొలాల్లో నీటి ఎద్దడి ఏర్పడినప్పుడు పంటలను కాపాడుకునే క్రమంలో కొందరు రైతులు కాలువలకు గండి పెట్టడం వలన పొలాలకు నీటి సరఫరా చేసుకుంటారు. ఇలాంటి ఇబ్బందికరమైన పరిస్థితుల్లో లస్కర్లు వాటిని నిరోధించి క్షేత్రస్థాయిలో అన్ని పొలాలకు సాగు నీటిని సక్రమంగా అందిస్తారు. అయితే వీరి ప్రాధాన్యతను విస్మరించిన ప్రభుత్వం ఖాళీగా ఉన్న లస్కర్ల పోస్టులను భర్తీ చేయడంపై దృష్టి పెట్టడం లేదు. గతంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఉద్యోగస్తులు విరమణ చేస్తే వాటిని ప్రభుత్వం తిరిగి భర్తీ చేయటం లేదు. బాపట్ల జలవనరుల ఉప విభాగంలో 48 మంది లస్కర్ల అవసరం ఉంది. అయితే 19 మందితో కాలం నెట్టుకొస్తున్నారు. చందోలు సాగునీటి సెక్షన్‌లో 30 మంది లస్కర్లకు 8 మందే పని చేస్తున్నారు. రైతులకు నీటి పారుదల శాఖ అధికారులకు అనుసంధానకర్తలుగా వ్యవహరించే లస్కర్ల కొరత ఏర్పడటంతో కాలువ కట్టలపై పర్యవేక్షణ లోపించింది. కాలువ కట్టలకు గండ్లు పడటంతో కొందరు కాలువ కట్టలను పొలాల్లో కలిపేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల కాలువ కట్టల మట్టిని, ఇసుకను అక్రమంగా తవ్వేసుకుని విక్రయించుకుంటున్నా అడిగేవారే లేకుండా పోయారు. డెల్టాలో అన్ని జలవనరుల విభాగాల్లో 50 శాతం మందికి పైగా లస్కర్ల కొరత వెంటాడుతూనే ఉంది. కనీసం నీటి సంఘాలైనా లేకపోవటంతో కాలువ కట్టల నిర్వహణ నానాటికీ తీసికట్టుగా మారింది. ఒకప్పుడు వెడల్పుగా ఉన్న కాలువ కట్టలు బొదిగట్టుగా మారుతున్నాయి. రైతుల తలలో నాలుకగా ఉండే లస్కర్ల నియామకంలో తాత్సారం చేయటం చూస్తుంటే రైతు ప్రయోజనాలను విస్మరించినట్లేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీటి కాలువల్లో కీలకపాత్ర పోషించే లస్కర్ల నియామకం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లస్కర్ల బాధ్యతలు...

- కాలువల్లో నీటి నిర్వహణ పరిశీలించడం
- కాలువలపై పిచ్చి మొక్కలు తొలగించడం
- నీటి పంపింగ్‌లో రీడింగ్‌ను పరిశీలించడం
- కాలువలకు గండ్లు పడితే అధికారులకు సమాచారం అందించడం
- అక్రమ నీటి వాడకాన్ని నిరోధించడం

ఇలా పలు రకాల ప్రయోజనాలు లస్కర్ల నియామకం ద్వారా ఉన్నాయి.

లస్కర్ల పనితీరు దోహదం

సముద్ర తీర ప్రాంతానికి దగ్గరలో ఉన్న నియోజకవర్గం కావటంతో జిల్లాలోని పలు కాలువలకు చివర భూములుగా ఉన్నాయి. నీటి ఎద్దడి వచ్చినా.. ముమ్మరంగా నీరు విడుదలైనా ఈ ప్రాంతానికి అతివృష్టి, అనావృష్టి రెండు ఏర్పడుతుంటాయి. ఈ సమయంలో లస్కర్ల పాత్ర కీలకంగా ఉంటుంది. ఒక్కొక్కసారి నీటి రీడింగ్ తీయటం కొద్దిసేపు ఆలస్యమైనప్పటికీ కాలువలు కొట్టుకుపోయే ప్రమాదం తీవ్రంగా ఉంటుంది. సాగునీటి సరఫరాలో వారబందీ పాటించి రైతులకు సకాలంలో సక్రమంగా సాగునీరు అందించటానికి లస్కర్ల పనితీరు ఎంతగానో దోహదపడుతుంది. అలాంటి వీరి నియామకం లేకపోవడం శోచనీయం.

జూన్ 1 నుంచి షాపుల వద్ద రేషన్ సరుకుల పంపిణీ

తహసీల్దారు నెహ్రూబాబు



వేమూరు: జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల వద్ద రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దారు నెహ్రూబాబు శనివారం తెలిపారు. అమర్తలూరు మండల కేంద్ర తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు రేషన్ షాపుల వద్ద బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ షాపుల వద్ద నిత్యావసర వస్తువులు సకాలంలో అందించేలా వీఆర్వోలు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఆయా గ్రామాల్లో రేషన్ షాపుల డీలర్లతో మాట్లాడి 1వ తేదీ సరుకులు సక్రమంగా పంపిణీ చేసే బాధ్యతలు అప్పగించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీకి విఫల యత్నం

తెనాలి రూరల్: పట్టణంలో ఏటీఎం చోరీకి దుండగులు శుక్రవారం తెల్లవారుజామున విఫల యత్నం చేశారు. ఇక్కడి గాంధీచౌక్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంను పగులకొట్టి నగదును దోచుకునేందుకు ప్రయత్నించారు. అలారం మోగడంతో పరారయ్యారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విస్తారంగా వర్షాలు



24వ వార్డులో ప్రధాన రహదారి పైకి చేరిన వర్షపు నీరు



23వ వార్డులో వర్షపు నీటితో కలిసి రహదారి పైకి చేరిన మురుగునీరు

రేపల్లె: రేపల్లె నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం ఏడు గంటల వరకు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా ఒక్కసారిగా కురిసిన కుండపోత వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలోని ప్రకాశం రోడ్డు, మున్సిపల్ ఆఫీసు రోడ్డు, నిజాంపట్నం రోడ్డుతోపాటు పలు రహదారులు పల్లపు ప్రాంతాలలో వర్షపు నీరు నిలబడింది. దీంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అయితే పట్టణంలోని పలు వార్డులలో మురుగు కాలువలలో పూడికలు సక్రమంగా తీయకపోవడంతో వర్షం నీరు పారుదలకు ఆటంకం ఏర్పడుతుంది. వర్షపు నీటితో పాటు కాలువలలోని మురుగునీరు రహదారుల పైకి చేరడంతో ఆ ప్రాంతాలు దుర్గంధ భరితంగా మారుతున్నాయి. పట్టణంలోని 22, 23, 24 వార్డులలో పలు రహదారులపై మురుగు నీటితోపాటు వర్షపు నీరు దర్శనమిస్తుంది. అధికారులు స్పందించి కాలువలలో పుడికలు సక్రమంగా తీయించాలని ఆయా వార్డు ప్రజలు కోరుతున్నారు. రేపల్లెలో 22.4 మిల్లీమీటర్లు, నగరంలో 23.6 మి.మీ, నిజాంపట్నంలో 18.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

మండలంలో 20.2 మి.మీ వర్షపాతం నమోదు

చెరుకుపల్లి: చెరుకుపల్లి మండలంలో శనివారం తెల్లవారుజామున పెద్ద పెద్ద ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదుర గాలులతో వర్షం కురిసింది. మండలంలో 20.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందిని తహసీల్దార్ సీహెచ్ పద్మావతి తెలిపారు. శనివారం కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి.

అగ్నిమాపక కార్యాలయం పరిశీలన

రేపల్లె: నూతనంగా నిర్మించే భవన సముదాయాలలో అగ్నిమాపక నివారణ యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని అగ్నిమాపక శాఖ రీజనల్ అధికారి జిలాని చెప్పారు. అగ్నిమాపక కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. షాపింగ్ మాల్స్, సినిమా హాల్స్, వైద్యశాలలు, కల్యాణ మండపాలు, అపార్ట్‌మెంట్‌లలో తప్పనిసరిగా అగ్నిమాపక నివారణ యంత్రాలను ఏర్పరుచుకోవాలన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఈ యంత్ర సామగ్రి దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

రేపల్లె: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన పట్టణంలోని 26వ వార్డులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి సాంబశివరావు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని 26వ వార్డుకు చెందిన కొలుసు శివయ్య గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగసిపడి పూరింటికి మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఘటనలో రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ శనివారం బాధితుని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

నేడు ప్రముఖ శిల్పకారులకు సత్కారం

తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత, తెనాలి శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి లైబ్రరీ ఆవరణలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. సమావేశానికి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహిస్తారు. ఏడు తరాలుగా శిల్పకళకు అంకితమైన కుటుంబం నుంచి వచ్చి, ఆ కళా వారసత్వాన్ని నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారులు రవిచంద్ర, శ్రీహర్షను ఇదే సమావేశంలో సత్కరిస్తారు. శిల్పకళతో జాతీయ, అంతర్జాతీయ గుర్తింపును పొందిన కాటూరి వెంకటేశ్వరరావు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ 'కళారత్న' అవార్డును స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన కుమారులైన రవిచంద్ర గవర్నర్ అవార్డును, శ్రీహర్ష కొండూరి వీరరాఘవాచార్యులు పురస్కారంను అందుకున్నారు. శిల్పకళా కుటుంబాన్ని 'మానవత' సత్కరించనుందని డాక్టర్ రామ్‌చంద్ వెల్లడించారు.

రోడ్లపై వ్యర్థాలను వేయకండి

ప్రత్తిపాడు: రోడ్లపై వ్యర్థాలను వేయకుండా స్వచ్ఛ పంచాయతీకి ప్రజలతో పాటు వ్యాపారస్తులు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా కోరారు. శనివారం ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులోని దుకాణదారులకు నోటీసులు అందించారు. రోడ్లపై చెత్త, వ్యర్థాలను పడేయవద్దని.. చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉదయం మాత్రమే వచ్చే చెత్త సేకరణ వాహనాన్ని ఆదివారం నుంచి మధ్యాహ్నం కూడా పంపిస్తామని అన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు



చింతాయపాలెంలో రహదారిని శుభ్రం చేయాలని ఆదేశిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. శనివారం ఆయన ఈవోపీఆర్డీ శ్రీనివాసరావుతో కలసి చింతాయపాలెం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో కొన్ని చోట్ల రహదారులు పశువుల పేడ, బురదతో అపరిశుభ్రంగా ఉండటంతో ఎంపీడీవో స్థానికులపై ఆగ్రహం వ్యక్తం చేసి రోడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. గ్రామస్తులు తమ ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపైకి రాకుండా ఇంకుడు గుంటలు ఏర్పాటు చేయాలని సూచించారు. వీధులను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ సిబ్బందిపై ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పీటా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వీరాస్వామిరెడ్డి ఉన్నారు. అనంతరం ఎంపీడీవో పేరలి గ్రామాన్ని సందర్శించి డబ్ల్యూపీసీ షెడ్డు నిర్మాణానికి కావలసిన స్థలాన్ని గ్రామ సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లుతో కలసి పరిశీలించారు. గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని డబ్ల్యూపీసీ షెడ్డుకు కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగమల్లేశ్వరరావు



నాగమల్లేశ్వరరావుకు నియామకపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రేపల్లె: బీసీ సంక్షేమ సంఘం రేపల్లె నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కేసన నాగమల్లేశ్వరరావు ఎంపికయ్యారు. ఇసుకపల్లిలోని శారద ఐటీఐ కళాశాలలో శనివారం బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. జాతీయ స్థాయిలో జనగణనతో పాటు సమగ్ర కులగణన చేయాలని డిమాండ్ చేశారు. దామాషా ప్రకారం బీసీలకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నాగమల్లేశ్వరరావును ఎన్నుకొని నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీఎస్ మూర్తి, ఎన్టీఆర్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మేక వెంకటేశ్వరరావు, శారద ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ బడుగు వెంకట నారాయణ, నాయకులు కె.రాంబాబు, ఉయ్యూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్చ్.. ఎందుకు ఆగిపోయిందో ?

- అసంపూర్తిగా భోజనశాల నిర్మాణం
- మధ్యలో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న చినరావూరు గ్రామస్తులు
- నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు



చినరావూరులోని కమ్యూనిటీ హాల్

తెనాలి అర్బన్: చినరావూరులోని కమ్యూనిటీ హాల్ పక్కన భోజనశాల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. మున్సిపల్ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చినరావూరులో పర్యటించారు. ఆ సమయంలో ఆ ప్రాంతవాసులు లూథరన్ చర్చి ముందు ఉన్న మున్సిపల్ స్థలంలో ఉన్న కమ్యూనిటీ హాల్ పక్కన భోజనశాల నిర్మించాలని కోరారు. అప్పటి ప్రభుత్వం 13వ వార్డుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.20 లక్షలను మంజూరు చేసింది. వాటిని భోజనశాల నిర్మాణానికి ఉపయోగించాలని కౌన్సిలర్ కుర్రా సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీను కోరారు. ఎమ్మెల్యే శివకుమార్ వారి అభ్యర్థన మేరకు నిధులు కేటాయించారు. వీటితో రేకులు షెడ్డుతో పాటు సీలింగ్, ఫ్యాన్లు, టైల్స్, బాత్‌రూమ్స్, వాష్‌బేషిన్‌ల నిర్మాణాలు చేయాలి. అప్పటి కాంట్రాక్టర్ షెడ్డు నిర్మాణం చేసి మిగిలిన వర్క్స్ నిలిపివేసినట్లు కౌన్సిలర్ సుజాత తెలిపారు. 13, 14, 15 వార్డులలోని పేదలు కమ్యూనిటీ హాల్‌ను ఎక్కువగా ఉపయోగించుకుంటూ ఉంటారు. పక్కనున్న భోజనశాల అసంపూర్తిగా ఉండటం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మిగిలిన పనులు కూడా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నిరుపయోగంగా వాష్ బేసిన్‌లు

వైభవంగా హనుమత్ జయంత్యుత్సవాలు



తెనాలి: స్థానిక షరాఫ్ బజార్‌లో ఉన్న శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక హనుమత్ జయంతి మహోత్సవాలు, 17వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామికి విశేష పూజలు, శ్రీ మన్యు సూక్త హోమం, సింధూర అర్చనను ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 11 రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు ఛత్రపతి శివాజీ నాటక ప్రదర్శన

తెనాలి: కళా,సాహిత్యాల అఖిల భారతీయ సంస్థ సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్, సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త నిర్వహణలో తెనాలిలో చారిత్రాత్మక నాటకం 'జయహో శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్' ప్రదర్శించనున్నారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు నాటక ప్రదర్శన ఉంటుందని శివాజీ స్మారక సమితి, హిందూ చైతన్య వేదిక, తెనాలి నిర్వాహకులు తెలియజేశారు. తొలిసారిగా డిజిటల్ టెక్నాలజీతో ప్రదర్శించనున్న ఈ నాటకంలో విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీ సాయిబాబా నాట్య మండలి కళాకారులు 60 మంది నటిస్తారని తెలిపారు. సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ రచించిన ఈ నాటకాన్ని ఆయన దర్శకత్వంలోనే ప్రదర్శిస్తారని, హైదరాబాద్‌లోని సీబీఆర్ అకాడమి ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ అధినేత చలసాని బలరామయ్య సహకారం అందిస్తున్నట్టు వివరించారు. ఛత్రపతి శివాజీ పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా జూన్ 8న సాయంత్రం 4 గంటలకు తెనాలిలో శోభాయాత్రను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రత్తిపాడు: యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని.. వాటికి దూరంగా ఉండాలని ప్రత్తిపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ ఎం.రవీంద్రబాబు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో శనివారం మాదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. అదే విధంగా గంజాయి, సిగరెట్లు, మద్యం వంటి వ్యసనాలకు బానిసలు కావొద్దని కోరారు. మాదక ద్రవ్యాల కేసులు తమపై నమోదైతే బంగారు భవిష్యత్తు బుగ్గిపాలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, యువత పాల్గొన్నారు.

యమ డేంజర్



వైకుంఠపురానికి వెళ్లే కాల్వకట్ట రోడ్డులో అయ్యప్పస్వామి గుడి వద్ద ..



నాజరుపేటలోని కాంచనమాల టవర్స్ దగ్గర..



నాజరుపేటలో కోర్టుల పక్కన ఎన్‌వీఆర్ కన్వెన్షన్ రోడ్డులో

పట్టణంలో ఏనాడో వేసిన సిమెంటు రోడ్లు దెబ్బ తింటున్నాయి. రోడ్డు మధ్యలో లోతైన గాడులు పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ముత్యంశెట్టిపాలెం నుంచి కాల్వ కట్టపై వైకుంఠపురం దేవస్థానానికి వెళ్లే రోడ్డులో భారీ పగులు ఏర్పడింది. వారం రోజుల కిందట ఆ మార్గాన ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యాభర్తలు కిందపడి పోయారు. అదృష్టవశాత్తూ పెద్ద గాయాలు తగల్లేదు. పట్టణ నాజరుపేటలోని కోర్టుల సముదాయం, ఎన్‌వీఆర్ కన్వెన్షను రోడ్డు, సెయింట్ జాన్స్ కాన్వెంట్ పక్కగా సంకా వారి కోట్ల బజారుకు వెళ్లే రోడ్డు, అక్కడకు దగ్గర్లోనే కాంచనమాల టవర్స్ ముందు నుంచి రామలింగేశ్వరపేట వెళ్లే రోడ్లపై ఇలాగే పగుళ్లు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనాలు జారిపోయి బోల్తా కొట్టే ప్రమాదం ఉంది. ప్రమాదాలు జరిగింతర్వాత అయ్యో! అనుకోవటం కన్నా ఆ పగుళ్లలో కాస్తంత తారు వేస్తే వాటిని నివారించవచ్చు. మున్సిపల్ అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – తెనాలి



నాజరుపేటలో సెయింట్‌జాన్స్ కాన్వెంట్ పక్కన ..